క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ వెంకటరమణ



ఓర్వకల్లు: ఓర్వకల్లు తహసీల్దార్‌గా శుక్రవారం ఎస్.వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. గూడూరులో విధులు నిర్వర్తిస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కడప జిల్లా, మైలవరానికి వెళ్లిన ఆయనను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ సుదరర్శన్, ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దార్ వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించి భూ, ప్రజా సమస్యలు, పరిశ్రమలపై ఆరా తీశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మహిళలతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ శుక్రవారం ఈఓఆర్డీ సందీప్ పర్యటించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఆయా కాలనీల్లో కలియతిరిగి ప్రజలతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈఓఆర్డీ ప్రజలుకు సూచించారు.

ఎత్తిపోతల పథకానికి నీటి మళ్లింపు



అధికారులతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్: మండలంలోని కొత్తకోట గ్రామం దగ్గర తుంగభద్ర నది నుంచి గూడూరు మండలంలోని రేమట ఎత్తిపోతల పథకానికి శుక్రవారం నీరు తరలింపునకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. డీఈ సుబ్బారాయుడు, ఏఈ దుర్గా భవాని, రైతులతో కలిసి పూజలు నిర్వహించి మోటార్లను ఆన్ చేశారు. సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం కొత్తూరు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే ప్రజా సమస్యలపై చర్చించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్ కింద రైతులు సాగు చేసిన ప్రతి పంటను రైతులు నమోదు చేయించుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం మండలంలోని కల్లపరి గ్రామంలో ఏఓ పర్యటించారు. రైతులు సాగు చేసిన పత్తి, ఆముదం, కంది పంటలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ శనివారం నుంచి మండలంలో రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

విద్యుత్ కోతలు... తప్పని ఇబ్బందులు

పాణ్యం: మండలంలో విద్యుత్ కోతలు పెరుగుతున్నాయి. సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా గంటలకొద్ది సరఫరా తీస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం మెయిన్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య తలెత్తుతుంది. రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కోతలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

సాగని... ఖరీఫ్ సాగు!

- కరుణించని వరుణుడు.. వాడుపట్టిన పైర్లు
- సగానికిపైగా తగ్గిన సాగు విస్తీర్ణం
- పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు



ఉల్లిపైరులో కలుపు తీస్తున్న కూలీలు



పూడిచెర్ల వద్ద నారుమళ్లను పెంచుతున్న దృశ్యం

ఓర్వకల్లు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సరిగ్గా రెండు నెలలు పూర్తయింది. జూన్ ప్రారంభంలో మినహా ఆశించిన వర్షాలు కురవలేదు. అడపాదడపా తప్పా దాదాపు నెలన్నరపాటు వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో రైతులకు నిరాశ తప్పలేదు. ఓర్వకల్లు మండలంలో దాదాపు 95 శాతం మంది రైతులు వర్షాధారంపైనే పంటలు సాగు చేస్తారు. అరకొర కురిసిన వర్షాలకు మొక్కజొన్న, పత్తి, ఉల్లి తదితర పంటలు సాగు చేశారు రైతులు. అయితే వరుణుడు కరుణించకపోవడంతో ఈ పంటలు వాడుపట్టాయి. దీంతో ఆందోళన చెందుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు తగ్గింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందజేస్తుండడంతో కొంత ధైర్యంగా ఉండేది. అయితే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడం కూడా ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గడానికి ఓ కారణం. ఓర్వకల్లు మండలంలోని 25 గ్రామాలలో కలిపి ఖరీఫ్ సాధారణ పంట విస్తీర్ణం 10,646 హెక్టార్లు కాగా కేవలం 4,430 హెక్టార్లలో సాగు అయ్యింది. సాగు విస్తీర్ణం సగానికిపైగా తగ్గిపోయింది. ప్రధానంగా వరి సాధారణ సాగు విస్తీర్ణం 263 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు ఒక్క ఎకరా కూడా సాగుకాకపోవడం గమనార్హం. మొక్కజొన్న సాధారణంగా 1,380 హెక్టార్లలలో సాగు అవ్వాల్సి వుండగా, ఈ ఏడాది 1,097 హెక్టార్లలో సాగైనట్లు వ్యవసాయ అధికారుల సమాచారం. కందులు 2,293 హెక్టార్లుకాగా, 1,380 హెక్టార్లకు తగ్గిపోయింది. అదేవిధంగా ఉల్లి 490 హెక్టార్లు కాగా, 424 హెక్టార్లలో సాగు చేశారు. వాణిజ్యపరంగా అత్యంత ప్రధాన్యత ఉన్న పత్తి 4,436 హెక్టార్లలో సాగు చేయాల్సి వుండగా, కేవలం 978 హెక్టార్లకే పరిమితమైంది. ఈఏడు ఖరీఫ్ సాగు ఏ మాత్రం ముందుకు సాగడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన కొర్ర, మిరప విస్తీర్ణం

ఈ ఏడాది మిగతా పంటలతో పోల్చితే కొర్ర, మిరప పంటల విస్తీర్ణం పెరిగినట్లు సమాచారం. కొర్ర 130 హెక్టార్లకు గాను, 153 హెక్టార్లలో సాగైంది. అలాగే మిరప సాధారణంగా 37 హెక్టార్లు సాగు చేయాల్సివుండగా, 40 హెక్టార్లు సాగు అయినట్లు అధికారులు తెలిపారు. నూనెగింజ పంటలైన ప్రధానంగా నవ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఆముదం, కుసుమలు తదితర పంటల సాగు పూర్తిగా తగ్గడంతో మార్కెట్‌లో వీటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

పొగాకు సాగుకు రైతుల మొగ్గు

పొగాకు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. గతేడాది పొగాకు రైతులు లాభాలు గడించారు. దీంతో ఈయేడు రైతులు పొగాకు నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం 10,646 హెక్టార్లుకాగా, అందులో ఇప్పటి వరకు కేవలం 4,430 హెక్టార్లలో వివిధ పంటలు సాగు అయ్యాయి. ఈ లెక్కన మిగిలిన 6,216 హెక్టార్ల దాదాపు ఐదువేల హెక్టార్ల వరకు పొగాకు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారుల అంచనా.

వర్షం కోసం ఎదురు చూస్తున్నాం



ప్రస్తుతం వరుణదేవుడు కరుణిస్తే బాగుంటుంది. ఈ ఏడాది నాకున్న నాలుగు ఎకరాలలో సగం మొక్కజొన్న సాగు చేయగా వర్షం కురవక గిడసబారుతుంది. చాలా ఇబ్బందిగా ఉంది. మిగిలిన సగం పొగాకు నాటుకోవాలని ఉంది. వరుణుడి కోసం ఎదురు చూస్తున్నాం.

–కురువ.సుంకన్న, చిన్నకారు రైతు, ఓర్వకల్లు

పొలం కౌలుకు ఇచ్చాను...



ప్రభుత్వం నుంచి పెట్టుసాయం అందదనే ఉద్దేశంతో నాకున్న మూడెకరాలను కౌలుకు ఇచ్చా. గత ప్రభుత్వం సకాలంలో రైతులకు రైతు భరోసా కింద ప్రతిఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం అందేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఆర్థిక సాయం అందేపరిస్థితి కనిపించలేదు. గతంలో మూడు ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేసేవాడిని.

–బోయ కృష్ణుడు, సాధారణరైతు, ఓర్వకల్లు

పొగాకు సాగుకు సిద్ధం చేస్తున్నాం



ఆరు ఎకరాలలో గతేడాది పొగాకు సాగు చేశాం. పెట్టుబడి ఖర్చులు పోనూ రూ.6 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కూడా పొగాకు నాటేందుకు పొలం సిద్ధం చేసుకున్నాం. నారుమడి పోసి, మొక్కలను పెంచుతున్నాం. గజం రూ.40–50 లకు భూమిని అద్దెకు తీసుకొని నారు పోసిపెంచుతున్నాం.

– బి.మధుశేఖర్, సన్నకారు రైతు, పూడిచెర్ల

భోగేశ్వరాలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

గడివేముల: మండల పరిధిలోని దక్షిణకాశీగా పిలువబడే దుర్గాభోగేశ్వరాలయంలో శుక్రవారం ఆరుద్ర నక్షత్ర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్యాం సుందర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి,అమ్మవార్లను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామి,అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చన, పావన్యాసపారయణ, రుద్రహోం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక కాశీరెడ్డినాయన ఆశ్రమంలో ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు.

7న మండల మీట్

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 7న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నాగమద్దమ్మ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు. అదేవిధంగా అధికారులు తమశాఖల ప్రగతి నివేదికలతో రావాలని ఎంపీడీఓ సూచించారు.

కాలినడకన ఉరుకుందకు వెళ్లిన భక్తులు



ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం కోడుమూరు నుంచి పెద్దఎత్తున భక్తులు ఉరుకుందకు కాలినడకన తరలివెళ్లారు. కోడుమూరు కోటవీధిలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి భక్తులు కాలినడకన తరలివెళ్లగా, ప్రజలు మేళతాళాలతో వారిని సాగనంపారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో వచ్చే అమవాస్య రోజు

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

- డీఏఓ పీఎల్ వరలక్ష్మి



బయోచార్ తయారీని వివరిస్తున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్

కల్లూరు: ప్రకృతి వ్యవసాయ విధానాలతో సాగు అధిక లాభాలు పొందవచ్చునని డీఏఓ పీఎల్ వరలక్ష్మి పేర్కొన్నారు. కల్లూరు మండల పరిధిలోని నాయకల్లు, చిన్నటేకూరు గ్రామాల్లో శాస్త్రవేత్త రాఘవేంద్ర, ఆత్మ డీపీడీ శ్రీలత, ఏడీఏలు సాలురెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, కన్సల్టెంట్ లక్ష్మయ్య పర్యటించారు. ముందుగా చిన్నటేకూరు గ్రామంలో బయోచార్ తయారీ, వాడకం ఉపయోగాలను రైతలకు వివరించారు. అనంతరం చిన్నటేకూరుతోపాటు నాయకల్లు గ్రామాల్లో మల్లె, కంది, మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించారు. డీఏఓ పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ బయోచార్ వాడడం వలన నేల భౌతిక రసాయనిక జీవ సంబంధమైన లక్షణాలు మెరుగుపడతాయన్నారు. నేలలో సేంద్రియ కర్బనం పెరిగి మొక్కకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు అందుతాయన్నారు.

నేల నిర్జీవ పదార్థం కాదు

నేల నిర్జీవ పదార్థం కాదు అని, లక్షలాది సూక్ష్మజీవులు, పోషకాలతో నిండి ఉంటుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే పర్యావరణం దెబ్బ తినకుండా, భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి వనరులను అందించే దిశగా కృషి చేసిన వారమవుతామన్నారు. అదేవిధంగా నాయకల్లు గ్రామంలో రైతు బాల భాస్కర్ శర్మ ఎనిమిది ఎకరాల్లో పకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనివాసరెడ్డి, శశిధర్‌రెడ్డి, మధుమతి, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటీవ్ సందీప్ కుమార్, ఏఈఓ డేవిడ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి



మురుగు కాలువను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు: సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. కొంగనపాడు గ్రామంలో పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రైనేజీలో దోమలు, ఈగలు, లార్వాలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లించాలన్నారు. నీరు కలుషితం కాకుండా ట్యాంక్‌లను సమయం ప్రకారం శుభ్రం చేయాలన్నారు. కుష్ఠు, లెప్రసీ సర్వే గురించి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో రికార్డులను, రిజిష్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫారం పాండ్స్ భూగర్భజలాల పెంపునకు దోహదం

ఓర్వకల్లు: భూగర్భ జలాల పెరుగుదలకు పారం పాండ్స్ దోహదపడుతాయని, ఆ దిశగా రైతులు ఏర్పాటు చేసుకోవాలని ఏపీఓ కుమార్‌సాయినాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగి ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద పారం పాండ్స్‌ను తవ్వించుకునే అవకాశం ఉందన్నారు. రైతుల అభిప్రాయం మేరకు 5''5''2, 10''10''2, 15''15''2 కొలతలతో గుంతలు తవ్వడం జరుగుందన్నారు. తద్వారా నీటి నిల్వలతో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. ఆసక్తి రైతులు భూ ధృవీకరణ పత్రాలతో అధికారులను సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సోమన్న

ఓర్వకల్లు: విద్యారంగా సమస్యల పరిష్కారమే ఏఐఎస్‌ఎఫ్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న తెలిపారు. మండలంలోని ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా జి.టోని, ఉపాధ్యక్షుడిగా అనిల్ చైతన్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు, సహాయ కార్యదర్శులుగా మాళి, ప్రసాద్, అమీద్, కోశాధికారిగా శరత్, సభ్యులుగా జమీన్‌బాషా, శోభన్, రోహిత్ తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అనుగుణంగా సమయానికి ఆర్టీసీ బస్సులను నడపాలని, తల్లికి వందనం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని 6న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను తరలిరావాలని పిలుపునిచ్చారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మిద్దె చిట్టెమ్మ

కల్లూరు: ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మన్ననలు పొందాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. కర్నూలు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన కల్లూరు అర్బన్ పరిధిలోని 31వ వార్డు కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ శుక్రవారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. కాటసాని దంపతులకు పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, భాస్కర్‌రెడ్డి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కల్లూరు : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం సంతోషకరమని ఎమ్మార్పీఎస్ సిటీ అధ్యక్షులు పాముల కుమార్ మాదిగ, విజయ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం కల్లూరులోని అంబేద్కర్ విగ్రహం దగ్గర మందకృష్ణ మాదిగ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. మందకృష్ణకు అనుకూలంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరి, రవి, ప్రసాద్, శ్రీరాములు, గోవింద్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలను నిర్లక్ష్యం చేయొద్దు



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: ప్రజా సేవలను నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ శకుంతల సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. మండలంలో గురువారం సామిజిక పింఛన్ పంపిణీ నేపథ్యంలో ఉద్యోగులు ఆలస్యంగా రావడంతో లబ్దిదారులు సచివాలయాల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. ఈ మేరకు అవ్వతాతలకు తప్పని నిరీక్షణ ప్రచురించిన సాక్షి కథనానికి ఎంపీడీఓ స్పందించారు. బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయ ఉద్యోగులను పిలిపించుకున్న ఎంపీడీఓ విధుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మున్సిపల్ ఏసీపీకి నోటీసులు

కర్నూలు (టౌన్): నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎస్.రంగస్వామికి టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ నుంచి శుక్రవారం షోకాజ్ నోటీసులు అందాయి. భవన నిర్మాణాల అనుమతులు జారీ చేయడంలో జాప్యం చేయడంతో పాటు లాగిన్‌లో 10 రోజులకు పైగా ఉండటంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పదే పదే చెబుతున్నా విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారని నోటీసులో పేర్కొన్నారు. 10 రోజుల వ్యవధిలో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆస్తి కోసమే హత్య



హత్య కేసు నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న కోడుమూరు సీఐ మన్సురుద్దీన్

కోడుమూరు రూరల్: ఆస్తి కోసం సొంత అన్నను హత్య చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణా రాష్ట్రం, రాజోలి మండలం పెద్ద ధనవాడ గ్రామానికి చెందిన మృతుడు చిన్న శేషిరెడ్డి(49)తో సోదరులకు కొన్నేళ్లుగా పొలం పంపకాల విషయంలో తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాగైనా చిన్న శేషిరెడ్డిని మట్టుబెట్టేందుకు చిన్న నాగిరెడ్డి, మహేష్, పెద్దశేషిరెడ్డి, తిమ్మారెడ్డి, జనార్దన్ వ్యూహం పన్నారు. చిన్న శేషిరెడ్డికి అక్క కొడుకైన తిమ్మారెడ్డితో ఫోన్ చేయించి పెద్దదొడ్డికి పిలిపించుకుని ఫుల్‌గా మద్యం తాపారు. అనంతరం నిందితులు చిన్న శేషిరెడ్డిని కట్టెలతో కొట్టి హత్య చేశారు. జూలై 29వతేదీన బొలెరో వాహనంలో, మోటార్ సైకిళ్లపై సుమారు 70కిలోమీటర్లకు పైగా తీసుకొచ్చి సి.బెళగల్ మండలం కొత్తకోట వద్ద శవాన్ని పడవేసి వెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, సి.బెళగల్ ఎస్‌ఐ తిమ్మారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని చిన్న శేషిరెడ్డి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు విచారణ చేపట్టారు. కాగా శవాన్ని నిందితులు పడవేసే క్రమంలో గొర్రెల కాపరులు, సమీప రైతులు చూడడంతో పాటు, వాహనాల వివరాలు తదితర వాటిని పోలీసులకు అందజేయడంతో నిందితులను గుర్తించడం సులువైంది. చిన్న శేషిరెడ్డిని హత్య చేసిన నిందితులైన చిన్న నాగిరెడ్డి, మహేష్, తిమ్మారెడ్డి, జనార్దన్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ విలేకర్ల సమావేశంలో వివరించారు. అయితే ఈ కేసులో ఇంకో నిందితుడు పెద్ద శేషిరెడ్డి పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని సీఐ వెల్లడించారు. కాగా కేసును త్వరగా ఛేదించేందుకు కృషి చేసిన సి.బెళగల్, గూడూరు, కోడుమూరు ఎస్‌ఐలు తిమ్మారెడ్డి, హనుమంతయ్య, బాలనరసింహులుతోపాటు సిబ్బందిని సీఐ అభినందించారు.